సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 30-1-2025
సంపుటి: 20 సంచిక: 261
పేజీలు: 8 వెల: రూ.1

## తూర్పుకాపు భవన స్థలాన్ని స్వాధీనపర్చాలి

**రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం తూర్పుకాపు సంఘ భవనానికి గత ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని పునరుద్ధరించి జిల్లా సంఘానికి స్వాధీనపర్చాలని రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి ప్రభుత్వ పెద్దలను కోరారు. బుధవారం అమరావతిలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ముఖ్య కార్యదర్శి వెంకటకృష్ణ, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సిసోడియాను కలిసి ఆమె విన్నవించారు. భవనానికి కేటాయించిన స్థలాన్ని స్వాధీనపరిస్తే భవన నిర్మాణం చేయడానికి జిల్లాతూర్పుకాపు సంఘం సిద్ధంగా ఉందని తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఉన్నతాధికారులు సత్వరమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉన్నతాధికారులను కలిసిన వారిలో శ్రీకాకుళం జిల్లా తూర్పుకాపుసంక్షేమ సంఘం అధ్యక్షులు కొండాల గణేష్, కార్యదర్శి పీఎస్ఆర్ నాయుడు ఉన్నారు.



## సచివాలయాల్లో నో ప్రింట్

**- జిరాక్స్ షాపులను ఆశ్రయిస్తున్న అర్జీదారులు -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రింటర్లు మూలకు చేరాయి. ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాన్ని ఆశ్రయించే అర్జీదారులకు జిరాక్స్ షాపుల్లో ప్రింట్ తీసుకోవాలని ధ్రువపత్రాల ఆన్‌లైన్ కాపీలను పంపించి సిబ్బంది చేతులు దులుపుకొంటున్నారు.** సచివాలయం వ్యవస్థ అమల్లోకి వచ్చిన 2019 నవంబర్‌లో అప్పటి ప్రభుత్వం అన్ని గ్రామ, వార్డు సచివాలయాలకు అవసరమైన ఫర్నిచర్, కంప్యూటర్లు, ప్రింటర్లను సరఫరా చేసింది. వీటి నిర్వహణ బాధ్యతను గ్రామ కార్యదర్శులకు అప్పగించింది. కంప్యూటర్, ప్రింటర్లు మరమ్మతుల వరకు అవసరమైన ఆర్థిక వనరులను గ్రామ కార్యదర్శులే సమకూర్చుతూ వచ్చారు. వీటి నిర్వహణ ఖర్చులకు సంబంధించిన బిల్లులను అడపాదడపా ప్రభుత్వం విడుదల చేస్తుండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని ఆలోచన చేయడం, కొన్ని సేవలను సచివాలయం నుంచి బదలాయిస్తున్నట్టు చర్చ సాగుతున్న నేపథ్యంలో కంప్యూటర్లు, ప్రింటర్లు మూలకు చేరినా, వాటి నిర్వహణను గ్రామ, వార్డు కార్యదర్శులు పట్టించుకోవడం లేదు. దీంతో ధ్రువపత్రాల జారీ సచివాలయం నుంచి నిలిచిపోయింది. సచివాలయానికి బదులుగా మీ-సేవా కేంద్రాలను అర్జీదారులు ఆశ్రయిస్తున్నారు. ధ్రువపత్రాలకు దరఖాస్తులను సచివాలయంలో స్వీకరిస్తున్నా, అసలు కాపీల ప్రింట్‌ను మాత్రం అందించడం లేదు. కాపీల కోసం జిరాక్స్ షాపులకు వెళ్లి ప్రింట్ తీసుకోవాలని సిబ్బంది సూచిస్తున్నారని అర్జీదారులు చెబుతున్నారు. సచివాలయాల్లో ప్రింటర్లు పూర్తిగా పాడైపోయాయని, కొన్నిచోట్ల కంప్యూటర్లు పాడైతే సిబ్బంది వ్యక్తిగత ల్యాప్‌టాప్‌లను తీసుకువచ్చి పనులు పూర్తి చేస్తున్నట్టు చెబుతున్నారు. కంప్యూటర్లు, ప్రింటర్లు పాడైనట్లు మండలపరిషత్, మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చినా బడ్జెట్ లేదంటున్నారని సిబ్బంది వాపోతున్నారు. ఉన్నవాటిని ఉపయోగించి పనులు పూర్తి చేయాలని అధికారులు సూచిస్తున్నట్లు సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు.

## 'నిప్పు' తెచ్చిన ముప్పు






- 15 భవంతులకు విజిలెన్స్ నోటీసులు
- ఫైర్ ఎన్‌వోసీ ప్లాన్ అనుమతులు అప్‌లోడ్ చేయాలన్న ఎస్పీ
- రెండో విడతలో మరిన్ని కట్టడాలపై గురి
- వణికిపోతున్న ఉద్యోగులు, వ్యాపారులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌లో సంభవించిన అగ్నిప్రమాదం మిగిలిన వ్యాపారుల చావుకొచ్చింది. ఇంతవరకు కార్పొరేషన్‌అధికారులను, ఫైర్ అధికారులను మేపి గుట్టుచప్పుడు కాకుండా భవనాలను నిర్మించుకొని, వచ్చిన సొమ్ముతో ప్రతీ ఏడాది ఎకరాలకు ఎకరాలు, కిలోల కొద్దీ బంగారాన్ని కూడేసుకుంటున్న వ్యాపారస్తులకు ఇప్పుడు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇదేదో అగ్నిప్రమాదం జరిగితే తమ పరిస్థితి ఏమిటని ఆలోచించడం వల్ల పుట్టిన భయంకాదు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు నగరంలో 15 బహుళ అంతస్తుల భవనాలకు కొద్ది రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. అసలు కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగానికి భవన నిర్మాణం కోసం పెట్టుకున్న ప్లాన్ ఏమిటి? అనుమతులు వచ్చిన ప్లాన్ ఏమిటి? నిర్మాణాలు చేపట్టిన ప్రాంతమెంత? ఫైర్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన ఎన్‌వోసీ వివరాలు వంటివి పట్టుకొని బహుళ అంతస్తుల భవన యజమానులు రావాలని ఆ నోటీసుల సారాంశం. మొదటి విడతగా విజిలెన్స్ శాఖ గుర్తించిన 15 షాపింగ్‌మాల్స్‌కు ఎటువంటి సెట్‌బ్యాక్స్ లేవు. అలా అని ఫైర్ ఎన్‌వోసీ లేకుండాపోలేదు. దీంతో మొత్తం కూలదోసి మళ్లీ సెట్‌బ్యాక్స్ విడిచిపెట్టి కట్టమంటారేమోనన్న భయంతో గడగడలాడిపోతున్నారు. ఎందుకంటే ఫైర్ ఎన్‌వోసీ రావాలంటే చుట్టూ ఫైరింజన్ తిరగడానికి స్థలం విడిచిపెట్టాలి. ఎన్ని అంతస్తులున్నా నాలుగు వైపులా ఓపెన్ స్పేస్ ఇవ్వాలి. అవేవీ లేకుండానే ఈ భవనాలన్నీ ఉన్నాయి. భవిష్యత్తులో రోడ్డు వెడల్పయితే, అప్పటికే ఉన్న భవనానికి డబ్బులు చెల్లించి స్థలాన్ని కొనుగోలు చేసే వీలు లేనందున రోడ్డుకు ముందు భాగంలో 10 అడుగుల స్థలం విడిచిపెట్టే నిబంధన ఒక్కటే పట్టించుకున్న కార్పొరేషన్ తన కళ్ల ముందే భారీ భవనాలు డీవియేషన్‌తో నిర్మిస్తున్నా సొమ్ములకు ఆశడి చోద్యం చూసింది. దాని ఫలితమే నగరమంతా పేకమేడల్లాంటి భవనాలు వెలిశాయి. ఇప్పుడు ఈ భవనాలు నిర్మిస్తున్నప్పుడు ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులు, ఫైర్ అధికారులు విజిలెన్స్‌కు సమాధానం చెప్పే పరిస్థితి ఏర్పడింది.

నగరంలో నోటీసులు జారీ - మిగతా చివరి పేజీలో




## విశ్వశాంతి వికాసం గాంధీజీ..!



**1948** జనవరి 30న గాంధీజీ భౌతికంగా తనువు చాలించారు. కానీ నేటికీ ఆధునిక ప్రపంచ పటానికి పాఠ్యపుస్తకమై సత్యప్రకాశంతో అహింసా వినీలాకాశంలో విశ్వశాంతి పరిమళాలను వెదజల్లుతూనే ఉన్నారు. కొన్ని కోట్ల గుండెల్లో ప్రేమయుద్ధం చేస్తూ తన చిరునవ్వుల సాక్షిగా మానవత్వమై ఉదయిస్తూనే ఉన్నారు. ఈ ప్రాభవం, ప్రభావం ఇంకా కొన్ని శతాబ్దాలు కొనసాగుతూనే ఉంటుంది. అందుకే సినీ గీత రచయిత సీతారామశాస్త్రి కలం గాంధీతత్వమై అక్షర జలపాతాన్ని..

**"భరతమాత తలరాతను మార్చిన విధాతరా గాంధీ**
**తరతరాల యమయాతన తీర్చిన వరదాతరా గాంధీ**
**గుప్పెడు ఉప్పును పోగేసి.. నిప్పుల ఉప్పెనగా చేసి**
**దండియాత్రనే దండయాత్రగా ముందుకు నడిపిన అధినేత..**
**సిసలైన జగజ్జేత**
**పదవులు కోరని పావన మూర్తి.. హృదయాలేలిన చక్రవర్తి"**

..అంటూ ప్రేరణాత్మకంగా కురిపించింది మనపై.

ప్రతి సంవత్సరం జనవరి 30న మన దేశమంతటా అమరవీరుల దినోత్సవం పేరుతో స్వాతంత్ర్య సంగ్రామంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన మహానుభావులను స్మరించుకుంటూ వారందరికీ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం.

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**



**ఈ** శతాబ్దపు వివిధ రంగాల్లో ప్రపంచ ప్రముఖులైన ఆల్బర్ట్ ఐన్ స్టీన్, ఆంగ్ సాన్ సూకీ, రవీంద్రనాథ్ ఠాగూర్, సీవీ రామన్, బెర్నార్డ్ షా, మార్టిన్ లూథర్ కింగ్, దలైలామా, నెల్సన్ మండేలా, స్టీవ్ జాబ్స్, కైలాష్ సత్యార్థి, బరాక్ ఒబామా, చార్లీ చాప్లిన్ వంటి తదితరులు సైతం గాంధీజీ నుంచి స్ఫూర్తి పొందినవారే. ఈ శతాబ్దపు అత్యంత ప్రభావశీల వ్యక్తుల్లో ప్రముఖంగా వినిపిస్తూ కనిపించే వ్యక్తిత్వపు హిమగిరి పేరు గాంధీజీ.

సత్యం, అహింస పునాదులపై విశ్వమానవతా ప్రేమ శిఖరాన్ని తన సందేశంగా, మన దేశపు ముఖచిత్రంగా గాంధీజీ నిలిపారు. ఆయన మార్గంలో నడిచి, అందరికీ ఆదర్శంగా నిలిచి ఎంతోమంది నోబెల్ బహుమతులు గెలిచారు. ఇంకా గెలుస్తారు. కొన్ని కారణాల వల్ల గాంధీజీకి నోబెల్ శాంతి బహుమతి ప్రకటించలేకపోయినందుకు నోబెల్ కమిటీ విచారం వ్యక్తం చేసింది. ఎన్నో ప్రపంచ స్థాయి ఉద్యమాలకు సత్యాగ్రహం, నిరాహారదీక్ష వంటి శాంతియుత మార్గాలే హైవేలుగా పని చేశాయి.. పని చేస్తున్నాయి.. ఫలితాలు వచ్చాయి.

వ్యవసాయం, వ్యాపారం, వాణిజ్యం, విద్య, వైద్యం, సైన్స్, పర్యావరణం వంటి ఏ రంగాల్లోనైనా ఆయన జీవిత పరిశోధనలే నేడు మనం అనుసరిస్తున్న పాఠ్యాంశాలు అయ్యాయి. ప్రేమతో, సామరస్యంతో ద్వేషంపై గెలవొచ్చని, సహనానికి మించిన సింహాసనం లేదని, యుద్ధం పేరుతో అధిపత్యం మాయలో మనుషుల్ని చంపడం దారుణమని, మతోన్మాదం మంచిది కాదని గాంధీజీ ఏనాడో హెచ్చరించారు. ప్రపంచ ఆకలిని తీర్చే అన్నం పెట్టే రైతన్న మన దేశపు ఆత్మగా అభివర్ణించారు. కార్మికులు, సైనికుల త్యాగం గొప్పదన్నారు.

కేవలం పాలన మారటమే స్వాతంత్ర్యం కాదని, అస్పృశ్యత, అంటరానితనం, అజ్ఞానం, పేదరికం, నిరుద్యోగం, అసమానతల, మత విద్వేషాల వంటి మహమ్మారులను మన దేశం నుంచి తరిమేయటమే నిజమైన స్వాతంత్ర్యం అనీ చెప్తూ చరిత్ర వెంట పాదయాత్ర చేసి ప్రజల్లో చైతన్యం నింపారు. ఆయన అస్తమించి ఏడు దశాబ్దాలు దాటినా ఇంకా అవే మహమ్మారులు మన దేశంలో కూడా అప్పుడప్పుడు అక్కడక్కడా కనిపిస్తూనే ఉన్నాయి. కయ్యానికి కాలు దువ్వుతూనే ఉన్నాయి.

కొన్ని దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొని, మూడవ ప్రపంచ యుద్ధం పోకడలు కనిపిస్తున్న ప్రస్తుత తరుణంలో యావత్ ప్రపంచానికి ఒకే ఒక దిక్సూచి గాంధీజీ. కన్నుకు కన్నే సమాధానం అయితే ఈ ప్రపంచం ఏనాడో గుడ్డిదయిపోయేదంటూ మరో న్యూటన్ భౌతిక శాస్త్ర గురుత్వాకర్షణ నియమం లాగా ఓ బతుకు శాస్త్ర మా'నవ' ఉనికి నియమం ఆనాడే చెప్పారు.

గ్లోబల్ వార్మింగ్‌తో పర్యావరణాన్ని నాశనం చేస్తున్న నేటి ఆధునిక మానవుని గురించి 'ప్రకృతి మన అవసరాలను మాత్రమే తీరుస్తుంది మన కోరికలను కాదని' సూచించాడు. పట్టణీకరణ యావలో పడి గ్రామాలే ఈ దేశానికి పట్టుగొమ్మలు అన్న విషయాన్ని మరువకూడదన్నారు. ఆయుర్వేదం, ధ్యానం వంటి ఆరోగ్య విధానాలను తను ఆచరించి నేటి తరానికి ఆదర్శమయ్యారు.

మనిషిలోని అంతర్లీనంగా దాగి ఉన్న ఆధ్యాత్మిక, నైతిక విలువలను వెలికితీయటమే విద్య పరమార్థం కావాలని, చిన్నారుల మనసుల్లో విద్వేషపు విషబీజాలు నాటేందుకు సాధనం కాకూడదనీ హెచ్చరించారు. శాస్త్రీయంగా ఎదుగుతూనే సాంకేతికత చాటున హింసను సృష్టించడం, ప్రకృతిని విధ్వంసం చేసే చర్యలు చేపట్టడం భవిష్యత్ తరాలకు ప్రమాదమన్నారు. నైపుణ్యాలను పెంపొందిస్తూ, జీవనోపాధిని ఇచ్చేవిధంగా ఆధునిక విద్య వుండాలని ఆకాంక్షించారు. ఈ దేశ భవిష్యత్తు పార్లమెంటులో కాదు.. పాఠశాలల్లోనే నిర్మించబడుతుందనే దార్శనికతను గాంధీజీ బలంగా విశ్వసించారు.

తన చేతిలో భగవద్గీత పట్టుకొని తన జీవన సమరాన్ని శోధించిన గాంధీజీ ఆత్మ కథ 'ద స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్' (సత్యశోధన) పుస్తకం ప్రఖ్యాత గ్రంథం బైబిల్ స్థాయి గుర్తింపు పొందింది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషల్లో ఈ పుస్తకం అనువాదం పొందింది. ప్రపంచ ప్రముఖ రచయితలు సైతం గాంధీజీపై ఎన్నో పుస్తకాలు రచించారు. గాంధీ రాసిన పుస్తకాలు, గాంధీజీపై వచ్చిన పుస్తకాలు బెస్ట్ సెల్లర్ జాబితాలో ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా గాంధీజీ విగ్రహాలు, ఆయన పేరు మీద నడిచే స్వచ్ఛంధ సంస్థలు, అవార్డులు, విద్యాసంస్థలు వంటివి చాలానే ఉన్నాయి. భారత ప్రభుత్వం కూడా అంతర్జాతీయ స్థాయిలో మానవాళిని ప్రభావితం చేసిన ప్రముఖులకు గాంధీ పేరు మీదే గాంధీ శాంతి బహుమతి అందిస్తున్నది.

ఇలాంటి సజీవ సాక్ష్యాలు ఎన్నున్నా గాంధీజీ జీవన సంద్రంలో ఓ నీటిబొట్టుగా చెప్పగలం. ప్రపంచ స్థాయిలో విశ్వమానవుడిగా అ'సాధారణ' వ్యక్తిగా విశేష ప్రాచుర్యం పొందిన గాంధీజీని నేడు మన భారతీయులలో కొంతమంది కులం, మతం కోణంలో చూస్తూ, చూపిస్తూ సంకుచితంగా ఆలోచించడం మనం ఆందోళన చెందాల్సిన విషయం. మన దేశ స్వాతంత్ర్య సంగ్రామానికి మాత్రమే ఆయనను పరిమితం చేస్తూ కొన్ని రాజకీయ పార్టీలు చేసే రాజకీయ నాటకీయపు పరిణామాలు ఇకనైనా ఆపాలి. అందరివాడుగా ఉన్న ఆయనను కొందరివాడుగా చేయడం మానుకోవాలి. మన దేశంలోనూ, విదేశాల్లోనూ అప్పుడప్పుడు అక్కడక్కడ ఆయన విగ్రహాలను ధ్వంసం చేయడం వంటి మానసిక పరిపక్వత లేని పనులను మనమంతా ఏకమై ఖండించాలి. మన జాతి సమగ్రతను కాపాడాలి.

గాంధీజీ పుట్టిన దేశం అంటూ ప్రపంచం మనల్ని గౌరవిస్తున్న తీరుతో ప్రతి భారతీయుడి గుండె గర్వపడాలి. ఆయన కలలుకన్న విశ్వశాంతి వికాసానికి మనమంతా సమిధలు కావాలి. విశ్వవిఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్ స్టీన్ 'రక్తమాంసాలతో కూడిన గాంధీజీ లాంటి యుగపురుషుడు ఈ భూమిపై నడిచాడంటే భవిష్యత్తు తరాలు నమ్మవు..!' అంటూ గాంధీజీకి అందించిన అక్షర నివాళి ఇంకా కొన్ని శతాబ్దాలు గాంధీని, గాంధీయిజాన్ని వేలకోట్ల తారల వెలుగై సత్యంతో ప్రకాశించేలా చేస్తాయి.

ఆయన వర్ధంతి సందర్భంగా ఆయనకు ఇష్టమైన పాటతో శ్రద్ధాంజలి ఘటిద్దాం.


*రఘుపతి రాఘవ రాజారాం..*
*పతిత పావన సీతారాం*
*ఈశ్వర అల్లా తేరే నామ్..*
*సబ్ కో సన్మమి దే భగవాన్*



• ఎడిటోరియల్


# పాపం అన్‌స్టాపబుల్

అది కుంభమేళా కావచ్చు.. హజ్ కావొచ్చు.. జెరూసలేం యాత్ర కావచ్చు.. అవి మొదలయ్యే నాటికి ప్రపంచ జనాభానే లక్షల్లోనో లేక కొద్దిపాటి కోట్లలోనో ఉండివుంటుంది. పైగా జిల్లాలోనే ఒక మూల నుంచి ఇంకో మూలకు వెళ్లడానికి రవాణా సౌకర్యాలు లేని ఆ రోజుల్లో (అప్పుడు జిల్లాలు కూడా లేవు) వాటికి ఏ కొద్దిమందో హాజరవుతూ ఉండివుండవచ్చు. కాలంతో పాటు మనిషి మారాలి. ఒకేచోట అంతమంది గుమిగూడడం వల్ల వచ్చే కష్టనష్టాలను బేరీజు వేసుకుని హాజరవ్వాలి. ఒకవేళ ఆ సందర్శనల వలన, స్నానాల వలన పుణ్యం వస్తుందని నిజంగా నమ్మితే పాపాలు చేయకుండా ఉండి పుణ్యాన్ని అలా కష్టపడి సాధించుకునే అవసరం నుంచి తప్పించుకోవచ్చు కూడా. ఇక మన దేశం విషయం వస్తే ఎవరికి దగ్గర్లో ఉన్న నదిలో వాడు మునిగితే చాలు. ప్రతి నదిలోనూ మునగక్కరలేదు. దొంగఓట్లు వేసేవాడు ఓటు వేసిన ప్రతిసారీ వేలు మీద వేసే సిరాను చెరిపేసుకున్నట్టుగా 'పాపం అన్‌స్టాపబుల్' అంటూ పాపాలు చేసుకుంటూ పోతూ నదులన్నిటిలోనూ మునుగుతూ వాటిని కడుక్కుంటూపోతే ఆ స్నానాలు నిజమైన పుణ్యాత్ములకి పాపం గేదెలను కడిగే కాలువల్లో స్నానం చేస్తున్నట్టుగా అనిపిస్తాయి. ఒకటి మాత్రం నిజం, వెర్రి వెయ్యింతలు పెరిగినా ప్రభుత్వాలు ఏర్పాట్లు అద్భుతంగా చేయగలగడం, తెలిసో తెలియకో దానిని నమ్మి స్వచ్ఛందంగా ఎంతోమంది సేవలు అందించడం నిజంగా అభినందనీయం. మాదక ద్రవ్యాలు అందుబాటులో ఉన్నాయి కదా అని సేవించకూడదు కదా. మతం కూడా అంతే. అది ఒక మాదక ద్రవ్యం. పైగా అది ఎంతోమందికి మారక ద్రవ్యం. దానిని మరీ సీరియస్‌గా తీసుకుంటే మనకే నష్టం. మహా కుంభమేళాలో బుధవారం వేకువ జామున 3 గంటల సమయంలో బ్రహ్మముహూర్తంలో పుణ్యస్నానాలు చేసేందుకు సంగంనోస్ ఘాట్ వద్ద జరిగిన తొక్కిసలాటలో 30 మంది చనిపోతే, 60 మంది గాయపడ్డారు. కోట్లాది మంది కుంభమేళాకు తరలిరావడం టూరిజం వ్యాపారానికి మేలు చేస్తుందేమో గానీ, ఇంతమందికి ప్రభుత్వం ఏర్పాట్లు చేయడమంటే కుదిరే పని కాదు. ఎవరి జాగ్రత్తల్లో వారుండాలి. అందరికీ పుణ్యం కావాలని, పాపాలను కడిగేసుకోవాలని తెలిసి తెలిసి పాపం చేశారు. తొక్కిసలాటలో 30 మందిని చంపేసింది సాటి మనుషులే. ఒకడి పీకను తొక్కేసి పక్కనే ఉన్న గంగలో మునకేస్తే పాపం పోతుందనుకోవడమే పెద్ద పాపం. ఒక్కసారి మనమూ ఆలోచించాలి. ఐఐటీ ఇంజినీరింగ్ చదివిన యువత అఘోరాలుగా, బాబాలుగా మారుతున్నారని గొప్పలు చెప్పుకునే రాజకీయాలు దేశాన్ని పాలిస్తున్నందుకు సిగ్గుపడాలి. అమెరికన్ ఇంజినీర్లు 50 లక్షల కోట్లతో కృత్రిమ మేధస్సు జ్ఞానాన్ని సృష్టిస్తే, చైనా యువత అదే పరిజ్ఞానాన్ని 60 లక్షలతో అమెరికా కంటే మెరుగైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ టెక్నాలజీని సృష్టించగలిగినప్పుడు మన ఐఐటీ ఇంజినీర్లు అఘూరాలో, బాబాలో ఎందుకు కావాలి? ఇలా మత ఉన్మాద ఉచ్చులో, కులం కుళ్లులో, మూఢనమ్మకాల్లో ఎంతకాలం బతుకుతాం? మనుషులే మారాలి. ఎగబడటం ఎందుకు? సామాజిక నియమాలు పాటించాలి కదా. కొంచెం ముందు వెనుకా... తోసుకోవడమెందుకో? అమృత్ స్నాన్ జరిగే రోజుల్లో వెళ్లకపోవడమే మేలని సామాజిక మాధ్యమాల ద్వారా ఎంతో మంది మొత్తుకున్నారు. స్వయంగా ఈ రద్దీలో స్నానంచేయలేమని సాధువులే వాయిదా వేసుకున్నారు. కొన్ని నెలలుగా యోగీ సర్కార్ చాలా పెద్ద ఏర్పాట్లు చేసింది.. చేస్తుంది. ఇన్ని రోజుల్లో ఏ చిన్న అసౌకర్యం కూడా జరగలేదు. కానీ 30 మంది ఒకేరోజు చనిపోకుండా ఉండాల్సింది. ఫేక్ దేవుళ్ల మీదే భారతీయ పిచ్చి, ఉన్మాదం. ఆమధ్య పుష్పరాజ్‌ను చూసేందుకు సంధ్యా థియేటర్‌కు వచ్చి జనాల కాలికింద నలిగిపోయింది రేవతి. తాజాగా ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగింది. కారణమేంటంటే.. రంజీ మ్యాచ్‌లో కోహ్లీ ఆటను చూసేందుకు భారీగా అభిమానులు తరలివచ్చారట. దీంతో గేట్ నెంబరు 16 వద్ద పరిస్థితి అదుపుతప్పి తొక్కిలాటకు దారితీసింది. పలువురు అభిమానులు గాయపడ్డారు. మొన్నటికి మొన్న తిరుపతి వేంకటేశ్వర స్వామిని వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకుంటే వైకుంఠానికి చేరుకుంటామని నమ్మి ఆ టిక్కెట్లిచ్చే క్యూలైన్‌లో తొక్కిసలాట జరిగి ఆరుగురు చనిపోయారు. ఇవన్నీ దేవుడు చేసిన హత్యలుగానే భావించాలి. ఎందుకంటే.. ఇంతమంది జనాలు వస్తే ఏ ప్రభుత్వమూ కంట్రోల్ చేయలేదు. మీరు హిందువులైతే పుణ్యస్నానాలకు తరలిరండి అంటూ పిలుపునిచ్చారు యోగి ఆదిత్యనాథ్. అబ్బే వస్తే వచ్చారుగానీ, కాస్త నిదానించి ఉన్నచోటే స్నానాలు చేయాలంటున్నారిప్పుడు. ఏదైనా జరిగేవరకు మతస్మరణ, జరిగిన తర్వాత సంతాప ప్రకటన తప్ప చేసేదేమీ ఉండదు. దీన్ని గమనించాల్సింది భక్తులే.



ఒక్కో బతుకుచిత్రానిదీ ఒక్కో సమస్య. కొన్ని సర్వసాధారణమే అయినా ఆ సమస్య తీర్చాలంటూ వారు చేసే విజ్ఞప్తులు, డిమాండ్లూ ఆశ్చర్యపరుస్తాయి. అలాంటి ఘటనే ఇప్పుడు రాజస్థాన్ ప్రజావాణీలో అక్కడి కలెక్టర్‌కు ఎదురైంది.

# వింత విన్నపాలు!



రాజస్థాన్ బార్మర్ జిల్లా కలెక్టర్ టీనాదాబీకి ప్రజావాణిలో ఓ వింత ఘటన ఎదురైంది. ఓరైతు కోరిన గొంతెమ్మ కోర్కెకు ఎలా స్పందించాలో అర్థం కాక ఒకింత నివ్వెరపోవడంతో పాటు, ప్రజావాణీ విన్నపాల ఒత్తిడిలో ఒకింత దరహాసాన్నీ ఇచ్చిన ఘటన అది.

**ఇంతకీ ఆ రైతు కథేంటి.. ఏమడిగాడు..?**

బార్మర్ జిల్లాలోని జోరాపూర్ గ్రామస్థుడైన మంగీలాల్ ప్రజావాణీలో ఫిర్యాదు చేయడానికొచ్చాడు. కలెక్టర్ టీనా దాబీని కలిశాడు. తన ఫిర్యాదు చదివిన కలెక్టర్‌కు ఆశ్చర్యపోవడమే తనవంతైంది. కారణం తన ఇంటి నుంచి తన పొలానికీ, తన పొలం నుంచి తన ఇంటికి వెళ్లేందుకు అతనో హెలిక్యాప్టర్ తనకు అరేంజ్ చేయాలని కోరాడు ఆ విన్నపంలో. అది చూసిన కలెక్టర్ ఒక్కసారిగా ఆశ్చర్యపోయి ఆ రైతుకేసి చూసి ఓ చిరునవ్వు నవ్వింది. ఆ తర్వాత అసలేమైందో వివరంగా చెప్పమని అని అడిగింది.

తన పొలం నుంచి ఇంటికి, ఇంటి నుంచి పొలానికి వెళ్లే దారిని ఉపాధ్యాయుడైనటువంటి ఖేరజరామ్ అనే వ్యక్తి కబ్జా చేశాడని, ఆ రహదారి మార్గంలో కూడా జీలకర్ర విత్తాడని మంగీలాల్ కలెక్టర్ చెప్పాడు. తాను ఎంతో కష్టపడి సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్.. అలాగే, పోలీస్‌అధికారుల సాయంతో తన పొలానికి రోడ్డు నిర్మించుకున్నాని తెలిపాడు. కానీ, ఖేరజరామ్ ఆ రోడ్డునంతా చదును చేసి దారిని మూసేశాడని ఆరోపించాడు. దాంతో తన ఇంటి నుంచి పొలానికీ, పొలం నుంచి ఇంటికి చేరుకునే మార్గం మూసుకుపోయిందని.. పలుమార్లు స్థానిక రెవెన్యూ అధికారులను కలిసి విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నది ఆ ఫిర్యాదు సారాంశం. దాంతో తానెలా తన పొలానికి వెళ్లాలో తెలియడం లేదని వాపోయాడు. అందుకోసం, తన ఇంటి ముందు ఓ హెలికాప్టర్ ఉంచితే రోజూ ఆ హెలికాప్టర్‌లో తన పొలానికెళ్లి, ఇంటికి తిరిగివస్తానని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వ్యవసాయమే జీవనాధారమైన తనకు పొలానికి వెళ్లందే బతుకు వెళ్లదని, కుటుంబ పోషణ కష్టమని పేర్కొన్న మంగీలాల్.. అటువంటి పరిస్థితున్నందునే తన కోసం ఓ హెలికాప్టర్ ఏర్పాటు చేయాలనే విజ్ఞప్తితో కూడిన డిమాండ్‌ను కలెక్టర్ ముందుంచాడు. దీంతో కలెక్టర్ టీనాదాబీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది.. ఒక ప్రత్యేకమైన కేసుగా మీడియాలోనూ హైలెట్ అయిన మంగీలాల్ ఇష్యూను ఏవిధంగా పరిష్కరిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఇక ఈ సందర్భంలోనే మనం కలెక్టర్ టీనాదాబీ గురించీ ఓసారి కాస్త చెప్పుకుంటే.. 2015 యూపీఎస్సీ టాపర్ అయిన టీనాదాబీ 2018లో అథర్ అమీర్‌ఖాన్ అనే మరో ఐఏఎస్ అధికారిని వివాహమాడారు. కానీ, రెండేళ్లు కూడా గడవకుండానే వారిద్దరి మధ్య పొరపచ్చాలతో విడాకులయ్యాయి. ఆ తర్వాత ఆమె ఏడాది క్రితం మరోసారి వార్తల్లో వైరల్ అయ్యారు. బీజేపీ ఎంపీ సతీష్ పూనియాకు ఐదుసార్లు వంగి వంగి దండాలు పెట్టడంతో ఆ వీడియో సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారింది.

**- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...**


## స్వీయ రక్షణ కళల శిక్షణకు దరఖాస్తులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో గల వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో గల విద్యార్థులకు స్వీయరక్షణ కళల శిక్షణకు గానూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఎస్.శశిభూషణరావు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో గల 269 ప్రభుత్వ, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6 నుండి 8 తరగతులు చదువుచున్న 5099 విద్యార్థినులకు, 414 జిల్లా పరిషత్, కె.జి.బి.వి., మున్సిపల్, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో 6 నుండి 9 తరగతులు చదువుచున్న 38077 మంది విద్యార్థినులకు రాణి లక్ష్మిబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ (సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం) పథకం క్రింద వచ్చేనెల 1 నుంచి మార్చి 15 వరకు కరాటే, టైక్వాండో వంటి స్వీయరక్షణ కళల్లో శిక్షణ ఇచ్చేందుకుగానూ దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఇండియన్ కంపెనీస్ యాక్ట్, 1956 లేదా ఇండియన్ కంపెనీస్ యాక్ట్, 2013, లేదా లిమిటెడ్ లైబిలిటీ పార్టనర్షిప్ ఫర్మ్ యాక్ట్ 2008 ప్రకారం రిజిస్టర్ కాబడిన లిమిటెడ్ లైబిలిటీ పార్టనర్షిప్ ఫర్మ్ రిజిస్ట్రేషన్ యాక్ట్, 1860 లేదా 1882 ప్రకారం రిజిస్టర్ సొసైటీ లేదా ట్రస్ట్ నుండి పై స్వీయరక్షణ కళల్లో 2024 మార్చి31వ తేదీ నాటికి కనీసం 3 సంవత్సరములు నుండి ఉనికిలో ఉండి విద్యార్థులకు శిక్షణ ఇస్తుండాలన్నారు. ఇతర అర్హతలు, టెక్నికల్ క్వాలిఫికేషన్స్ వివరములు, ఎంపిక విధానం, ధరఖాస్తు సమర్పించవలసిన సర్టిఫికేట్ వివరములు ఈ కార్యాలయపు వెబ్‌సైట్ (deosklorg) నందు పొందుపరచామన్నారు. ఆసక్తి గల సంస్థలు సదరు వెబ్‌సైట్ నుండి వివరాలు తెలుసుకుని పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 31 నుంచి వచ్చేనెల 3వతేదీ సాయంత్రం 5 గంటల లోగా అందజేయాలని కోరారు.



మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన గాంధీజీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సహాయకురాలు నాగమ్మలు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, పాలకొండ**



## వ్వాటే ఇస్టయిల్ జగ్గూభాయ్

ఫ్యామిలీ ఆడియెన్ మెచ్చే హీరోగా జగపతిబాబు విలన్‌గా, సహాయ నటుడిగా అద్భుతంగా రాణించారు. ఇటీవల సోషల్ మీడియాల్లోను ఆయన స్పీడ్‌గా ఉన్నారు. తాజాగా అతడు షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అభిమానుల్లో హాట్ టాపిక్‌గా మారింది. జగ్గూభాయ్ స్టైలిష్ ఫ్యాంట్ ధరించి, బ్లాక్ టీషర్ట్‌పై లాంగ్ కోట్‌తో ఎంతో స్టైలిష్‌గా కనిపించాడు. కళ్లకు ఆ రేబాన్, మెడలో ఎగ్జిక్యూటివ్ బ్యాగ్‌తో స్టైల్ అదిరిపోయింది. ఈ ఫోటోగ్రాఫ్‌లో అతడు ఎంతో నేచురల్‌గా కనిపిస్తున్నాడు. అంతకుమించి అతడి ఫ్యాషన్ సెన్స్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఇన్ స్టాలో షేర్ చేసిన ఈ ఫోటోగ్రాఫ్‌కి అతడు ఇచ్చిన క్యాప్షన్ కూడా ఆకట్టుకుంది. "బజారుకి పోదాం రండి!.." అంటూ జగపతి ఫన్నీ కోట్‌ని ఇచ్చారు.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**

## చరణ్, ఎన్టీఆర్.. అలా మిస్సయిపోయారు!

నవతరం దర్శకులకు ఒక్క హిట్ పడగానే, స్టార్ హీరోల నుంచి పిలుపు అందుకొంటున్నారు. కథ, క్యారెక్టరైజేషన్ నచ్చితే చాలు, హీరోలు కూడా దర్శకుల అనుభవాన్ని లెక్కలో తీసుకోకుండా ప్రాజెక్ట్‌ని పట్టాలెక్కిస్తున్నారు. అయితే చందూ మొండేటి మాత్రం ఈ పదేళ్లలో 5 సినిమాలు తీసి, ఇద్దరు హీరోలకే పరిమితం అయిపోయాడు. అటు.. నాగచైతన్య, ఇటు నిఖిల్‌లతోనే సినిమాలు చేసుకొంటూ వచ్చాడు. కార్తికేయ, కార్తికేయ 2 పెద్ద హిట్లు అయినా, స్టార్స్‌తో పని చేయలేకపోయాడు. కాకపోతే అవకాశాలు మాత్రం వచ్చాయి. వాటిని మెటీరియలైజ్ చేసుకోలేకపోయాడంతే. "కార్తికేయ తరవాత ఎన్టీఆర్ నుంచి పిలుపొచ్చింది. ఓ కథ చెప్పాను. ఆయనకు బాగా నచ్చింది. దాన్ని డవలెప్ చేసే ప్రోసెస్‌లో ఎన్టీఆర్ మరో సినిమా హడావుడిలో పడిపోయారు. గీతా ఆర్ట్స్‌కు ఓ కథ చెబితే దాన్ని అరవింద్ రామ్ చరణ్‌తో చేద్దామని చెప్పారు. అయితే అప్పటికే చరణ్ ఓ ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు. అలా వచ్చిన అవకాశాలు చేజారిపోయాయి. నేను కూడా చైతన్య, సిద్దార్థలతో కంఫర్ట్ జోన్‌లో పడిపోయాను. అందులోంచి బయటకు రావాలని వుంది. కాకపోతే.. వెంటనే సిద్దార్థతో "కార్తికేయ 3 చేయాలి" అని చెప్పుకొచ్చారు చందూ. వెంకటేష్, నాగార్జునలతో ఓ మల్టీస్టారర్ చేయాలన్నది చందూ మొండేటి ఆశ. అదో పోలీస్ కథ. స్క్రిప్టు సిద్ధంగానే వుంది. వెంకీ, నాగ్ కలిస్తే.. కాంబినేషన్ పరంగా ఆ క్రేజ్ మామూలుగా వుండదు. మరి ఆ కలయిక చూసే అవకాశం ఎప్పుడు దొరుకుతుందో?

**- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...**



## బ్లాక్ డ్రెస్‌లో పూజా హై గ్లామర్ ట్రీట్

స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే ప్రతి ఒక్క ఫోటోషూట్‌తో తన స్టైల్ ను మరో లెవెల్ కు తీసుకెళ్తుంది. తాజాగా ఆమె బ్లాక్ డ్రెస్‌లో పోజులిచ్చిన ఈ కొత్త ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మరింత గ్లామర్ కలబోసిన ఈ లుక్ ఆమెకు మరింత ప్రత్యేకతను తెచ్చిపెట్టింది. బ్లాక్ అండ్ వైట్ కాంబినేషన్‌లో, ట్రెండీ డిజైన్‌లో ఉన్న ఈ డ్రెస్సింగ్ స్టైల్ ఆమెను హై ఫ్యాషన్ లుక్‌లోకి తీసుకెళ్లింది. పూజా హెగ్డే అవుట్‌ఫిట్స్ ఎప్పుడూ క్లాసీగా, స్టైలిష్‌గా ఉంటాయి. ఈ సారి ఆమె ధరించిన బ్లాక్ డ్రెస్, థ్రెడ్ వర్క్ డిజైన్, స్లీవ్‌లెస్ ఫిట్ కట్ విత్ స్లిట్ స్టైల్ కలిపి లుక్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. పెర్‌ఫెక్ట్ మేకప్, స్టేట్‌మెంట్ ఇయరింగ్‌లు, కాంపాక్ట్ హెయిర్ స్టైల్ అన్నీ కలిసి ఆమెను రెడ్ కార్పెట్ రిచ్‌లుక్‌లో చూపించాయి. ఈ ఫోటోలలో కళ్లతోనే ఆకర్షణ కలిగించేలా ఆమె ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ చూస్తుంటే నిజంగా పూజా హెగ్డే తన గ్లామర్ స్టైల్‌లో యునీక్ అని మరోసారి నిరూపించుకుంది. హైహీల్స్, లైటింగ్ ఎఫెక్ట్, బ్యాక్‌డ్రాప్ అన్నీ కలిపి ఈ ఫోటోషూట్‌ను హై స్టాండర్డ్‌కు తీసుకెళ్లాయి. ఈ ఫోటోలు ఆమె లేటెస్ట్ ప్రాజెక్ట్ ప్రమోషన్‌లో భాగమా లేక వేరే స్పెషల్ కంటెంట్‌గా వచ్చాయా అనేది ఇంకా క్లారిటీ లేదు. ఇక ఈమె ఫ్యాషన్ స్టేట్‌మెంట్ అన్నది ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్‌లను సెట్ చేసేలా ఉంటుంది. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసే ప్రతి ఫోటోకి లక్షలల్లో లైక్స్ రావడం చూస్తుంటే అభిమానులు ఎంతగానో కనెక్ట్ అవుతున్నారని అర్థమవుతోంది. ముఖ్యంగా ఈ బ్లాక్ డ్రెస్ లుక్ పూజా కెరీర్‌లో మరొక ట్రెండింగ్ ఫ్యాషన్ మూమెంట్‌గా నిలిచిపోవడం ఖాయం. ఇప్పటికే పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న పూజా హెగ్డే, విజయ్ 69లో కూడా మెయిన్ హీరోయిన్‌గా కనిపించబోతోంది. అలాగే హిందీలో కూడా పలు సినిమాలు లైన్ లో ఉన్నాయి. ఇక తెలుగులో ఈమధ్య అమ్మడికి అవకాశాలు తగ్గాయి. అయినప్పటికీ తన అందంతో సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు తన ఉనికిని చాటుకుంటోంది.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో..**



# మదర్ థెరిస్సా ఆశ్రమం సందర్శన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు స్థానిక సానా వీధిలో గల మదర్ థెరిస్సా ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలుగురికి సేవ చేసే సేవాభావం అందరిలోనూ ఉండాలని వృద్ధులు దేశానికి ఎప్పటికీ భారం కాదన్నారు. మార్గదర్శి జాతిపిత అయినటువంటి మహాత్మ గాంధీని స్మరించుకుంటూ అతను చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలో గల వృద్ధులకు దుప్పట్లను, పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.ఇందిరాప్రసాద్‌లు పాల్గొన్నారు.



# సిఐటియు నుంచి ఏఐటీయూసీలో చేరిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సిఐటియు అనుబంధ సభ్యులుగా ఉన్న శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ఏ, బి, సి డివిజన్లలో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక నాయకులు ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌లో చేరారు. స్థానిక నాగావళి రివర్‌వ్యూ పార్క్‌లో గురువారం జరిగిన సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధ సంఘ గౌరవ అధ్యక్షుడు టి. తిరుపతిరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, కళ్యాణి అప్పలరాజు సమక్షంలో ఏఐటీయూసీ సభ్యులుగా చేరారు. ఏఐటియుసి సభ్యులుగా చేరిన వారిని వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ కార్మికుల హక్కుల కోసం వారి సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తుందన్నారు. ఈ సందర్భంలో ఏఐటియుసిలో చేరిన కార్మికులు భవిష్యత్తులో కూడా కార్మికుల తరపున పోరాటాలు చేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ఎన్. చంద్రరావు, జె.గురుమూర్తి, ఎన్.పార్థసారధి, ఆర్.గణేష్, బొమ్మాళి. కుర్రావు, పొట్నూరు గోపి, కవ్వాడి కృష్ణకుమారి, మాదుగుల గిరి, డి.రమణ, రామచంద్ర, పి.సురేష్, కె.తిరుమలరావు, గౌతం, రాజు తదితరులు పాల్గొన్నారు




# ఎయిర్ ఫోర్స్‌లో కెరీర్ గురించి అవగాహన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో యువత చేరే విధంగా జిల్లాలో అవగాహన కల్పించడానికి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రతినిధులు జిల్లాకు వచ్చినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పూర్ణచంద్ర రావు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్‌లో గల 12 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ నుంచి కమాండింగ్ ఆఫీసర్ వింగ్ కమాండర్ గురుప్రీత్ అట్వాల్ విజ్ఞప్తి మేరకు కలెక్టర్ అనుమతితో విద్యార్థులకు అవగాహన నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవగాహనా సదస్సులు ఆర్ట్స్ కాలేజీలో, కేంద్రీయ విద్యాలయం, శ్రీ చైతన్య సహకార జూనియర్ కాలేజీలో నిర్వహించారు. సికింద్రాబాద్ నుంచి వచ్చిన సార్జెంట్ ఎస్‌కే జాట్ ఆధ్వర్యంలో ఈ సదస్సులు జరుగుతున్నాయన్నారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ గురించి ఇలాంటి అవగాహన సదస్సులు జిల్లాలో మొదటి సారిగా జరగడం చాలా సంతోషంగా ఉందని, యువత సైన్యంలో చేరితే దేశ భవిష్యత్ ఇంకా మెరుగు పడుతుందని, క్రమశిక్షణ మరియు భాధ్యత కలిగిన సమాజాన్ని చూడవచ్చు అని తన అభిప్రాయాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ ఎ.శైలజ తదితరులు పాల్గొన్నారు.

# కుష్టువ్యాధిగ్రస్తులకు సహకారమందిస్తాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కుష్ఠువ్యాధిగ్రస్తులకు సహకారమందిస్తామని, ప్రతి రెండు నెలలకు ఒకసారి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు ప్రముఖ వైద్యులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. స్థానిక లెప్రసీ కోలనీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ కుష్టు వంశపారంపర్యం, అంటువ్యాధి కాదని, సకాలంలో గుర్తించి చికిత్సలు పొందితే ఏడాదిలోపు పూర్తిగా కోలుకోవచ్చన్నారు. వైద్యశిబిరంలో భాగంగా బిపి, షుగర్, ఇతరత్రా పరీక్షలతో పాటు వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. సెక్రటరీ డాక్టర్ పైడి సింధూర మాట్లాడుతూ శరీరముపై పాలిపోయిన లేదా రాగి రంగు మచ్చలు ఉన్నప్పుడు,ఆ మచ్చలపై స్పర్శ లేనపుడు, నొప్పి తెలియనపుడు, శరీరం, ముఖ్యంగా పాదములు, చేతులు, వేళ్ళ తిమ్మిర్లు ఉన్నప్పుడు, చర్మం దళసరిగా ఉన్నప్పుడు ఈ వ్యాధిగా అనుమానించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సెంట్రల్ జీవితకాల సభ్యులు టెక్కం రామ్ గోపాల్, మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లం శివతేజ, సభ్యులు పొడుగు చరణ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జిరాయితీ రైతు భూములలో బీటీ రహదారి



(సత్యంన్యూస్, మందస)

మండలం బేతలాపురం పంచాయితీ పరిధిలో బేతలాపురం రహదారి నుంచి సముద్రం తీరానికి సుమారు రెండు కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణ పనులు రైతుల జీడి కొబ్బరి జిరాయితీ భూముల మధ్య నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అధికారులు, కాంట్రాక్టర్లు నిర్మాణం చేపడుతున్నారని బేతలాపురం గ్రామానికి చెందిన గుంటు మాధవరావు, బైపల్లి పాపమ్మ, గుంటు అంకమ్మతో పాటు మరో ముగ్గురు రైతులు ఆరోపిస్తున్నారు. సుమారు ఆరు ఎకరాలు సర్వే నెంబర్ 57/2లో 59/6లో బీటీ రోడ్డు నిర్మాణం పనులు రైతులు అనుమతులు లేకుండా రాత్రి పగలు పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ కాంట్రాక్టర్ వైష్టవి కనస్ట్రక్షన్ రైతుల అనుమతులు లేకుండా బీటీ రోడ్డు పనులు చేపడుతున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీవో వెంకటేష్‌కు, తహసీల్దార్ ఎస్ హైమవతికు, ఎస్ఇకు ఫిర్యాదు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. సర్వే నెంబర్ 57/2 లో 59/6 రైతుల జిరాయితీ భూములేనని రెవిన్యూ అధికారులు సర్వే యర్‌లు గుర్తించినట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వం రెవెన్యూ రికార్డ్‌లు పరిశీలించి రైతుల మెట్టు జిరాయితీ భూములేనని రికార్డుల్లో నకళ్లు జారీ చేశారన్నారు. రైతుల అనుమతులు లేకుండా నష్ట పరిహారం చెల్లించకుండా ప్రజాప్రతినిధులు అండదండలతో దౌర్జన్యంగా బీటీ రోడ్డు నిర్మించారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని రైతులు తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్ పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష రైతులకు న్యాయం చేయాలని కోరారు. న్యాయం జరగకపోతే కోర్టును ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు రైతులకు న్యాయం చేయాలని ఆ రైతులు కోరుతున్నారు.



# ప్రతిభావంతులకు అవార్డుల ప్రధానోత్సవం



(సత్యంన్యూస్, నరసన్నపేట)

నరసన్నపేట వి.ఎన్.బి కళ్యాణమండపంలో గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ (జి.ఈ.ఓ) ఆధ్వర్యంలో బుధవారం వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన ప్రతిభావంతులకు ఆవార్డుల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిఈఓ ఫౌండర్ సద్గుణ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు చదువుకునేందుకు జిఈఓ సహకరిస్తుందని, వారికి కార్పొరేట్ తరహా విద్య అందించేందుకు కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నామని, విద్యార్థులకు అవసరమైన ఫీజులు పుస్తకాలు అందిస్తామని అన్నారు. శ్రీకాకుళం పట్టణంలో గత నాలుగు సంవత్సరాలుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ నరసన్నపేటలో ఈ సంవత్సరం ప్రతిభ అవార్డులను ప్రధానం చేస్తుందని, అన్ని రంగాలలో ప్రతిభ గల వారిని గౌరవించి ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలియజేశారు. ఇందులో భాగంగా టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ గొడ్డు చిట్టిబాబు మాట్లాడుతూ, ప్రతిభావంతులను గుర్తించడం వారిని వెన్ను తట్టి ముందుకు నడిపించడం, సామాజికపర చైతన్యం విద్యార్థుల్లో కలిగించేందుకు జీఈవో చేపడుతున్న కార్యక్రమం అభినందనీయమని, వైఎంసీఏ ద్వారా తాను గత కొద్ది సంవత్సరాలుగా క్రీడారంగ అభివృద్ధికి, కొన్ని స్వచ్ఛంద సేవా కార్యక్రమాల నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు, వివిధ సేవా రంగాలలో ఉన్న ప్రముఖులకు, పత్రిక రంగంలో పని చేస్తున్న విలేకరులకు, పోలీసు ఉద్యోగులకు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు, కళాకారులకు గౌరవ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఈవో సభ్యులు టిడిపి నాయకులు ఊన్న పెద్ద బాబు, బోయిన సతీష్, వైద్యులు గొండు స్వామి బాబు, గుడ్ల నాగరాజు, వారణాసి సంతోషి, తంగుడు జ్వాల, ముచ్చేటి సుధాకర్, జగదీశ్ శర్మ, ఎఎస్బి ఆసిరినాయుడు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ఏటికొప్పాక బొమ్మలు శకటానికి మూడో స్థానం రావడం హర్షణీయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




ఈ నెల26న ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున ప్రదర్శించిన ఏటికొప్పాక బొమ్మలు శకటాల ప్రదర్శనల్లో జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంకు మూడో స్థానంలో నిలవడం అభినందనీమయని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మన సంస్కృతి చాటే సాంప్రదాయ బొమ్మలకు జాతీయస్థాయిలో పురస్కారం దక్కడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబులకు ధన్యవాదాలు తెలిపారు.

# కృష్ణదాస్‌కి ధన్యవాదములు

(సత్యంన్యూస్, నరసన్నపేట)

సీనియర్ జర్నలిస్ట్ సదాశివుని క్రిష్ణకు వైకాపా నరసన్నపేట నియోజకవర్గం మేధావుల ఫోరం అధ్యక్షులుగా పార్టీ అధిస్థానం నియమించినందుకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన క్రిష్ణదాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంతి మేజిస్ట్రేట్ సదాశివుని ప్రభాకరరావు, మేజర్ పంచాయతీ వార్డు మెంబర్ రఘు పాత్రుని శ్రీధర్ (బుజ్జి), యు.జగన్నాధరావు, ఆర్.వైకుంఠరావులు పాల్గొన్నారు.



# కుంభమేళాకి ప్రత్యేక బస్సులు





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కుంభమేళాకి శ్రీకాకుళం బస్‌స్టేషన్ నుండి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి, ఏ.విజయకుమార్ తెలిపారు. బుధవారం శ్రీకాకుళం బస్‌స్టేషన్ ఆవరణలో కుంభమేళాకి సంబంధించిన కరపత్రాలను/బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డి.పి.టి.ఓ. మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ వద్ద గల కుంభమేళాకు వచ్చేనెల 8 రాత్రి 8గంటలకు శ్రీకాకుళం బస్‌స్టేషన్ నుండి బయలుదేరి, మార్గమధ్యంలో పూరిలోని జగన్నాథస్వామి దేవాలయం, కోణార్క్‌లోని ప్రసిద్ధ సూర్యదేవాలయం, భువనేశ్వర్‌లోని లింగరాజ ఆలయం, ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానము చేసిన తర్వాత, తిరుగు ప్రయాణములో కాశి, గయ, బుద్ధ గయ దర్శింపచేసి శ్రీకాకుళానికి, శుక్రవారము రాత్రి చేరుతుందన్నారు. ప్రయాణీకులకు రవాణా సౌకర్యంతో పాటు ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. 7 రోజుల్లో 7 క్షేత్రాల దర్శనం నిమిత్తం భోజన సౌకర్యంతో కలిపి రూ.9,500లు టిక్కెట్ ధరగా నిర్ణయించామన్నారు. టికెట్లు www.apsrtconline.in ద్వారా శ్రీకాకుళం బస్‌స్టేషన్లో పొందవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు 99592 25608, 99592 25609,7095040608,7382917289 నంబర్లలో సంప్రదించాలన్నారు. భక్తులంతా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2వ డిపో మేనేజర్లు హెచ్.అమరసింహుడు, రవిశంకర్‌శర్మ, రమేష్, గంగరాజు, రాజు, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 1న రామమందిర ప్రతిష్ట

(సత్యంన్యూస్, సంతకవిటి)



మండలంలోని గోవిందపురం గ్రామంలో వచ్చేనెల 1, 2 తేదీల్లో హనుమత్ సమేత రామమందిర ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ ఉత్సవాలు 2,3 తేదీల్లో కూడా కొనసాగుతాయన్నారు. ప్రముఖ వేదపండితులు రేజేటి శ్రీనివాసశర్మ(రాయగడ), పులఖండం శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో రేజేటి శ్రీరామశర్మ, వేమకోటి నాగభూషణ శర్మ, సతీష్ శర్మ, శ్రీకాంతశర్మ, సంతోష్‌కుమార్‌శర్మలచే సంప్రదాయ బద్ధంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. శనివారం మధ్యాహ్నం అన్న సమారాధన జరుగుతుందన్నారు. ఆదివారం రాత్రి నరసన్నపేటకు చెందిన చంద్రమౌళి, విజయప్రభ బృందం ఆధ్వర్యంలో బాలనాగమ్మ బుర్రకథ ప్రదర్శన ఉంటుందన్నారు. సోమవారం రాత్రి "రామాంజనేయ యుద్ధసీను"(మందారాడ), ఆ తర్వాత "సత్యహరిశ్చంద్ర"నాటక ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని స్థానిక కమిటీ ప్రతినిధులు కోరారు.

## కదలలేని స్థితిలో ఉన్న వారికి నేరుగా జీవిత ధ్రువీకరణ

(సత్యంన్యూస్, పొందూరు)

అస్వస్థతతో కదలలేని స్థితిలో ఉన్న విశ్రాంత ఉద్యోగులకు, కుటుంబ పింఛనుదారులకు స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నేరుగా జీవిత ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నారు. పొందూరు, వాండ్రంగి, లోలుగు తదితర గ్రామాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఇంతవరకు 40మందికి వీటిని అందజేశారు. ఫిబ్రవరి చివరి వారం వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సూర్యప్రకాశరావు, వాండ్రంగి దామోదరరావు, వడగా సూర్యారావు, పాలవలస దివాకర్ పాత్రో తదితరులు పాల్గొంటున్నారు. ఇతర వివరాలకు పి.సూర్యం సెల్ 94412 49793ని సంప్రదించాలని జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి అంకం ధర్మారావు, పొందూరు శాఖ అధ్యక్షులు నాళం పైడిరాజు శుక్రవారం కోరారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఈ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

- పరీక్ష ఫీజులు పూర్తిగా ఉచితం
- హాస్టల్ ఫీజులు నామమాత్రం
- ఈ ఏడాది నుంచి కొత్త కోర్సులు
- పిల్లల్లో వ్యక్తిత్వం కోరుకునే తల్లిదండ్రులకు వరం సత్యసాయి యూనివర్సిటీ

అకడమిక్ ఎక్సలెన్స్‌తో క్యారెక్టర్ డెవలప్‌మెంట్ కావాలి అనుకునే వారికి శ్రీ సత్యసాయి యూనివర్సిటీలో యూజీ, పీజీ కోర్సుల్లో చేరేందుకు నోటిఫికేషన్ విడుదలయింది. పుట్టపర్తి శ్రీ సత్యసాయి యూనివర్సిటీ యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ మార్కులు ఆధారంగా ఆపై ఇంటర్వ్యూ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు. మూడు లేదా నాలుగేళ్ల డిగ్రీ కోర్సు, పరీక్ష ఫీజులు పూర్తిగా ఉచితం. హాస్టల్ ఫీజులు మాత్రం నామ మాత్రంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది అనేక కొత్త కోర్సులు ప్రారంభించింది. గత ఏడాది ప్రవేశపెట్టిన ఆక్చ్యూరియల్ సైన్స్ విత్ కంప్యూటేషన్ బయాలజీతో పాటు ఈ ఏడాది ఎఫ్ఈడీ (ఫైనాన్స్, ఎకనామిక్స్, డేటా ఎనలిటిక్స్) కోర్సు ప్రారంభించింది. టెక్సాస్, బోస్టన్ తదితర యూనివర్సిటీల్లో మాత్రమే ఉండే ఈ కాంబినేషన్ ఇప్పుడు తొలిసారిగా ఈ యూనివర్సిటీలో ప్రారంభించారు. వీరికి మొత్తం నాలుగు క్యాంపస్‌లు ఉన్నాయి. పుట్టపర్తి ప్రధాన క్యాంపస్‌తో పాటు బెంగుళూరు (వైట్ ఫీల్డ్) ముదినేహళ్లిలో క్యాంపస్‌లు ఉన్నాయి. మహిళల కోసం అనంతపురంలో క్యాంపస్ ఉంది. పిల్లల్లో వంద శాతం వ్యక్తిత్వ నిర్మాణం కోరుకున్న తల్లిదండ్రులకు ఈ యూనివర్సిటీ ఒక వరం. అక్కడ పిల్లలకు స్మార్ట్ మొబైల్ ఫోన్ అనుమతి లేదు. అన్ని రకాల సినిమాలు చూసే వీలు లేదు. శాంతిని సూచించే తెల్ల వస్త్రాలతో ఉండాలి, ఎప్పటికప్పుడు నీట్‌గా షేవ్ చేసుకోవాలి. పొద్దున్నే ఐదింటికి సుప్రభాతానికి హాజరు కావాలి. ఇలా శారీరకంగా, ఆధ్యాత్మికంగా మంచి శిక్షణ అందించే వర్సిటీ ఇది. అయితే ఇన్ని కట్టుబాట్ల మధ్య పిల్లలు అక్కడ ఉండటం కష్టం. ఉంటే మాత్రం సంపూర్ణ వ్యక్తిత్వ కలిగినవారై ఒక ఉన్నత ఆలోచనతో ఎదుగుతారు. కేవలం ఐదు నుంచి పది శాతం మాత్రమే సక్సెస్ రేట్ ఉన్న అనేక ప్రైవేటు యూనివర్సిటీల కన్న ఇది అనేక రెట్లు మేలు. సక్సెస్ రేటు అంటే చదువులో మాత్రమే అనుకుంటే పొరపాటు. వివరాలకు https://www.sssihl.edu.in సంప్రదించండి.

– సీహెచ్ దుర్గాప్రసాద్




# జగనన్న విశ్వసనీయత ఇప్పుడు తెలుస్తోంది

- మాట తప్పిన చంద్రబాబుపై ప్రజలకు విరక్తి పెరిగింది
- వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటిపోయినా ఎన్నికల హామీలను అమలుచేయని చంద్రబాబును చూసి జగనన్న విశ్వసనీయత ఏమిటో ఇప్పుడు ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటున్నారని, ఆయన విశ్వసనీయత, చిత్తశుద్ధి, సంకల్పం ఎంత గొప్పవో చర్చించుకుంటున్నారని వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సందర్భంగా అరచేతిలో వైకుంఠం చూపించి, కనికట్టు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ఇప్పుడు ఆ హామీలు నెరవేర్చలేమని, పథకాలివ్వలేమని సాక్ష్యాత్తు సచివాలయంలోనే ప్రకటించడం ప్రజలను దగా చేయడమేనని అన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.1.19 లక్షల కోట్లు అప్పులు తీసుకువచ్చారని, దాంతో ఎంతమేరకు సంపద సృష్టించారో, ఎన్ని ఉద్యోగాలిచ్చారో చంద్రబాబు నాయుడు చెప్పాలన్నారు. ఉన్న ఉద్యోగాలను తీసేసి లక్షలాది మంది ఉద్యోగులను రోడ్డున పడేస్తున్న మాట వాస్తవం కాదా అని ఆయన ఆ ప్రకటనలో ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి ముందుచూపుతో మూడు పెద్ద పోర్టులు, హార్బర్లు నిర్మించగా, వాటిని ఇప్పుడు తెలుగుదేశం నేతలకు తెగనమ్మాలనుకుంటున్నారని, జగన్ తీసుకువచ్చిన 15 మెడికల్ కాలేజీలను ఇప్పుడు తెలుగుదేశం నేతలకు కట్టబెడుతున్నారని ఆయన ఆరోపించారు. పవన్‌కల్యాణ్‌తో మూడు సినిమాలు తీసిన నేతకు 1200 ఎకరాలు దోచిపెట్టారని, సంపద సృష్టి అంటే ఇదేనా అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. చంద్రబాబు ముసుగు తీసేసి మళ్లీ ప్రజలను మోసం చేయడానికి నెమ్మదిగా ప్రయత్నిస్తున్నారని, దాన్ని జగన్మోహన్‌రెడ్డి మీదకు నెట్టేయడానికి ఇప్పటికీ ప్రయత్నించడం విడ్డూరంగా ఉందన్నారు. కోవిడ్ లాంటి సంక్షోభంలో కూడా ప్రజలను ఆర్థికంగా నిలబెట్టిన జగన్మోహన్‌రెడ్డి మీద ప్రభుత్వం నిందలు వేయడం సరికాదన్నారు. సాధారణంగా ఆర్థిక ప్రగతిని ఆ ప్రభుత్వ పాలన మొత్తాన్ని కలిపి చూస్తారని, కానీ విచిత్రంగా నీతిఅయోగ్ 2022-23 సంవత్సరాన్ని కొలమానంగా తీసుకోవడం దేనికి సంకేతమని పురుషోత్తం ప్రశ్నించారు. చంద్రబాబు పరిపాలించిన 2014-19 మధ్య కోవిడ్ లాంటి సంక్షోభం లేదు కాబట్టి ఆర్థికంగా బాగున్నట్టు కనిపిస్తుందని, దాన్ని చూపించి చంద్రబాబు మెరుగనడం మోసం చేయడమేనన్నారు. వాస్తవంగా నీతి అయోగ్ రిపోర్టు చూస్తే జగన్ హయాంలో ఫిజికల్ హెల్త్ ఇండెక్స్ 13వ స్థానానికి పడిపోయిందని చెప్పారని, కోవిడ్ కారణంగా హెల్త్ ఇండెక్స్ పడిపోవడాన్ని తాము కాదనడంలేదని, కానీ చంద్రబాబు పాలనలో కూడా మన రాష్ట్రం 13వ ర్యాంకులో ఉందని, అందుకు కారణమేమిటో చెప్పాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి చేసిన అప్పుల మీద కూటమి ప్రభుత్వం రోజుకో అంకె చెబుతోందని, అలాగని చంద్రబాబు అప్పులు తీసుకురావడంలేదా అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు ఇప్పటి వరకు ఎటువంటి సంక్షేమ పథకమూ అమలుచేయకపోగా జగన్మోహన్‌రెడ్డి హయాంలో అమలైన ఫీజు రీయంబర్స్‌మెంట్, అమ్మఒడి లాంటి పథకాలకు ఇప్పటి వరకు రూపాయి విదిలించకపోవడంతో విద్యార్థుల జీవితాలు కూడా నాశనమవుతున్నాయని ఆరోపించారు.



# జగన్‌రెడ్డి కుటుంబం లూటీ రూ.8లక్షల కోట్లు

ఎమ్మెల్యే కూన రవికుమార్

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఐదేళ్లలో అధికారాన్ని అడ్డు పెట్టుకొని జగన్‌రెడ్డి రూ.8 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని, భూ కేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ అనుమతులు.. ఇలా ప్రతిదానిలో ఆశ్రిత పక్షపాతానికి ఒడిగట్టి లక్షల కోట్లు సంపాదించారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఈమేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి గుండెకాయ అయిన సచివాలయాన్ని కూడా ఆయన తాకట్టు పెట్టారని, టీడీఆర్ బాండ్లు, స్మార్ట్‌మీటర్ల కొనుగోళ్లు, రేషన్ బియ్యంలో చేతివాటం, చివరకు చిన్నారుల పోషణకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు వంటివాటిలో కూడా పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారన్నారు. అలాగే జగన్ విలాసాలకు, జల్సా రూ.19,871.35 కోట్లు ప్రభుత్వ ధనాన్ని దుబారా చేశారన్నారు. తాడేపల్లి ప్యాలెస్ వద్ద 986 మంది సెక్యూరిటీ ఖర్చే వెయ్యికోట్లు అయిందని, సచివాలయాలకు రంగులు వేయడం, మళ్లీ వాటిని తొలగించడానికి రూ.3వేల కోట్లు, తాడేపల్లి ప్యాలెస్‌లో పెన్ను, పేపరు ఖర్చు రూ.9.84 కోట్లు, మద్యం షాపుల్లో ఎలుకలు పట్టడానికి 1.36 కోట్లు, రుషికొండ మీద విలాసవంతమైన భవన నిర్మాణానికి రూ.600 కోట్లు, సాక్షి పేపర్‌కు దోచిపెట్టింది రూ.500 కోట్లు.. ఇలా ప్రతీదానిలోనూ ప్రజాధనమే దుర్వినియోగమైందన్నారు. రూ.10 లక్షల కోట్లు అప్పు తెచ్చి ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లింపుల కోసం రూ.1.40 లక్షల కోట్లు భారం అవుతుందని, దీని వల్ల ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని కూన రవికుమార్ అన్నారు. గడిచిన ఏడు నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు రూ.22 వేల కోట్లు చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందని, ఇప్పుడు అప్పులు కూడా పుట్టని పరిస్థితికి రాష్ట్రం చేరిపోయిందంటే అందుకు జగన్మోహన్‌రెడ్డిని కాక ఎవరిని నిందించాలని ఆయన ప్రశ్నించారు.



# 'నిప్పు' తెచ్చిన ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

చేసిన 15 మాల్స్, హోటల్స్ నిర్వహిస్తున్న భవనాలు అక్రమ నిర్మాణాలుగా తేల్చారు. వీటిలో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు గుర్తించినట్టు విశ్వసనీయ సమాచారం. నోటీసులు జారీచేసిన 15 భవనాలు ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేసినా పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు, వీటిలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడానికి ఎన్‌వోసీ జారీచేసిన అగ్నిమాపక శాఖ అధికారుల వివరణ కోరడానికి విజిలెన్స్ అధికారులు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. 15 మాల్స్‌కు నోటీసులు జారీచేసిన విజిలెన్స్ అధికారులు నోటీసులు అందుకున్న 5 రోజుల్లో భవన నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ శాఖ అధికారులు జారీ చేసిన ప్లానింగ్ అనుమతులు, అగ్నిమాపకశాఖ అధికారులు జారీ చేసిన ఎన్‌వోసీలు జోడించి హార్డ్‌కాపీలను ఆన్‌లైన్‌లో సమర్పించాలని ఆదేశించారు. భవనంలో ఎటువంటి వ్యాపార, వాణిజ్య కార్యలాపాలు నిర్వహిస్తున్నారు, ఎన్ని చదరపు అడుగుల్లో భవన నిర్మాణం చేశారు. ఎన్ని ఫ్లోర్లు, ఎన్ని చదరపు అడుగులు, అగ్నిమాపకశాఖ జారీ చేసిన ప్రాథమిక ఎన్‌వోసీ, ఫైనల్ ఎన్‌వోసీలను, మున్సిపల్ అధికారులు జారీ చేసిన పత్రాలను సమర్పించాలని 15 యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు.

సంక్రాంతికి ముందు జీటీ రోడ్డులో ప్రారంభించిన సీఎంఆర్ షాపింగ్ మాల్ ఒక్కటే ఐదు అంతస్థులు భవనంలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఇటీవల అగ్నిప్రమాదం సంభవించిన సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌తో పాటు, ఎస్ఆర్ షాపింగ్ మాల్, ఆర్ఎస్ఎం షాపింగ్‌మాల్, ఆర్‌కే స్టోర్, ఆర్ఎస్ దేవీ కాంప్లెక్స్, జీషాన్ హోటల్ నాలుగు అంతస్థుల భవనాల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మూడు అంతస్థుల భవనాల్లో జీఎన్ జ్యూవెలరీ, వందనా షాపింగ్ మాల్, హ్యాపీ షాపింగ్ మాల్, మాలిక్ డ్రెసెస్, రైమాండ్స్ షోరూం, డే అండ్ నైట్, రామలక్ష్మణ జంక్షన్‌లో ఉన్న ట్రెండ్స్, హీరావత్ షోరూమ్, రామ్‌రాజ్ కాటన్స్, మాక్స్ షాపింగ్ మాల్స్ ఉన్నాయి. వీటన్నింటికీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నోటీసులు జారీచేశారు. అయితే వీటితో పాటు నగరంలో అనేక బహుళ అంతస్థుల భవనాల్లో లెక్కలేనన్ని ఆసుపత్రులు, హోటల్స్, లాడ్జీలు, బంగారం షాపులు ఉన్నాయి. వీటికి రెండో విడతలో నోటీసులు ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. వందేళ్ల క్రితం పట్టణంగా రూపుదిద్దుకున్న శ్రీకాకుళంలో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు విస్తరించినా అందుకు అనువైన రోడ్లు, పార్కింగ్ స్థలాలు లేవు. ప్రతి 20 ఏళ్లకు మున్సిపల్ శాఖ రూపొందించే మాస్టర్ ప్లాన్ నగర రూపురేఖలు మార్చడానికి ఏమాత్రం అనువుగా లేదని విమర్శలు గత 30 ఏళ్లుగా వినిపిస్తున్నాయి. మాస్టర్ ప్లాన్‌కు అనువుగా రోడ్లు విస్తరించడానికి నగరపాలక సంస్థ అధికారులు చేస్తున్న ప్రయత్నాలను రాజకీయంగా అడ్డుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో నగరంలో పెరిగిన జనాభా, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు అనువుగా రోడ్ల విస్తరణ చేయడం లేదు. దీంతో పాటు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించడానికి అనువుగా నిర్మాణం చేస్తున్న భవనాల యజమానులు నిబంధనలు పాటించడం లేదని విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రమాదాలు సంభవించినప్పుడు వ్యాపారులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లి, అందులో పని చేస్తున్న కార్మికులు రోడ్డున పడుతున్నారు.

**'సౌత్ ఇండియా' కార్మికులకు భరోసా**

సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోయినా, అందులో వివిధ హోదాల్లో పని చేస్తున్న 250 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఆ మాల్ పునర్నిర్మాణం పూర్తి చేసుకొని వ్యాపారం ప్రారంభించాలంటే కనీసం ఏడాది పడుతుందని యాజమాన్య ప్రతినిధులే చెబుతున్నారు. దీంతో ఇందులో పని చేస్తున్న 250 మంది కార్మికులు వేరే ఉపాధి అవకాశాలు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రమాదం జరిగిన సమయంలో కార్మికులంతా మాల్ వద్దకు చేరుకొని ఉపాధి కల్పిస్తున్న మాల్ అగ్నికి దగ్ధమైపోవడాన్ని జీర్ణించుకోలేక బోరున విలపించారు. మాల్‌లో కార్మికులకు సంక్రాంతికి నెల రోజుల ముందు నుంచి 16 గంటలు పని చేస్తూ వచ్చారు. దీనికి మాల్ యాజమాన్యం కార్మికులందరికీ సంక్రాంతి రోజును ఒక నెల వేతనాన్ని బోనస్‌గా ఇచ్చింది. జనవరి నెలకు సంబంధించిన వేతనాలు ఫిబ్రవరి నెలలో చెల్లించాలి. అయితే ఈ నెల 25న మాల్ అగ్నిప్రమాదం జరగడంతో జనవరి నెల వేతనం ఫిబ్రవరిలో చెల్లించే పరిస్థితి లేదని భావించిన కార్మికులకు యాజమాన్యం వేతనాలు చెల్లిస్తామని భరోసా ఇచ్చినట్టు తెలిసింది.

# రథసప్తమి ఉత్సవాలకు రూ.50 వేలు విరాళం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆరోగ్య ప్రదాత, ప్రత్యక్ష దైవం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి ఉత్సవాలకు జనసేన నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ తన ఛాంబర్‌లో కార్పొరేషన్ ఆర్ఐ ఉమామహేశ్వరరావుకు రూ.50వేల చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ రథసప్తమి ఉత్సవాలను రాష్ట్ర పండుగ నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఉత్సవాల నిర్వహణకు నగర సుందరీకరణకు శ్రీకారం చుట్టిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్‌దినకర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌లకు అభినందనలు తెలిపారు.



# వైద్యవిభాగం అధ్యక్షులుగా శ్రీనివాస్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం అసెంబ్లీ నియోజక వర్గం వైద్య విభాగానికి అధ్యక్షులుగా సీనియర్ ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్ నియమితులయ్యారు. గత 30 ఏళ్లుగా ఫిజియోథెరపిస్ట్‌గా ది న్యూ ఫ్రెండ్స్ ఆఫ్ ది ఎర్త్ వాలంటరీ ఆర్గనైజేషన్ ద్వారా సేవలందించారు. వివిధ ఎన్జీవో సంస్థల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. తన నియమకానికి కృషి చేసిన, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు, జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌కు, డాక్టర్ చింతాడ వరుణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# బాపూజీ బాట విశ్వశాంతికి స్ఫూర్తి


**విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు । ఘనంగా గాంధీ మందిరం 4వ వార్షికోత్సవ వేడుకలు**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచానికి సత్యం, అహింస మార్గాలను అందించి పోరాట స్ఫూర్తికి ప్రతిరూపంగా నిలిచిన మహాత్మాగాంధీ చూపిన బాట విశ్వశాంతికిస్ఫూర్తిని అందిస్తుందని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు పేర్కొన్నారు. శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిర భారత స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తల స్మృతివనం 4వ వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తలను ఒకేచోట కొలువుదీర్చి భావితరాలకు మహనీయుల త్యాగాలను తెలియజేసే ప్రయత్నం ఎంతో గొప్పదన్నారు. తొలుత గాంధీ మందిరం ఆవరణలో 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు.

**శాస్త్రోక్తంగా విశ్వశాంతి హోమం**

విశ్వశాంతి కోరుతూ జిల్లాకు చెందిన పోలీసు, సీఆర్పీఎఫ్, ఆర్మీలో పనిచేసిన అమరవీరుల స్థూపం గాంధీ మందిరంలో నెలకొల్పిన క్రమంలో విశ్వశాంతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వాహక బృందం ఆధ్వర్యంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, సరోజ దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అవధాన పండితులు పైడి హరనాథరావు, నిష్టల నర్సింహమూర్తి, స్వాతంత్ర్య సమరయోధుల కీర్తిని ఆలపించారు. అనంతరం గాంధీ మందిర కమిటీ బృందం విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావును, విశ్వశాంతి హోమకర్తలు వేణుగోపాల్ దంపతులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు సురంగి మోహనరావు, ఎం.ప్రసాదరావు, జామి భీమశంకర్, బలివాడ మల్లేశ్వరరావు, నిక్కు అప్పన్న, వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, బరాటం లక్ష్మణరావు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పొన్నాడ రవికుమార్, బాడాన దేవభూషణ్, నటుకుల మోహన్, కొమ్ము రమణమూర్తి, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, పెంకి చైతన్యకుమార్, మహిబుల్లా ఖాన్, మెట్ట అనంతంభట్లు, పందిరి అప్పారావు, బుడుమూరు సూర్యారావు, మాజీ సైనికుల సంక్షేమాధికారి ఈశ్వరరావు, తమ్మినేని ఉషారాణి, బెందాళం వరలక్ష్మి, పద్మావతి, పాండ్రంకి మురళీకృష్ణ, ఎంవీఎస్ఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.